క్లుప్తంగా

నేడు మహలక్ష్మి అమ్మవారి జాతర

అంబాజీపేట: మాచవరం గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి పండు, కార్యదర్శి గంద్రోతు శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి జాతరలో పూజ ఘటాలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణం వద్ద శనివారం తీర్థం ఏర్పాటు చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పండిత సదస్యం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో గురువారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం సామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవ నిర్వహించారు. వేదపండితులు మంత్రాల పఠనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కల్యాణోత్సవాలు సందర్భంగా కేశవ దీక్ష చేపట్టిన భక్తులు ఈఓ భాగవతుల ఆధ్వర్యంలో ర్యాలి నుంచి వాడపల్లి క్షేత్రానికి కాలినడకన వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కిసాన్ సెల్ కన్వీనర్‌గా దేశినీడి

మలికిపురం: రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ కన్వీనర్ మలికిపురం మండలం రామరాజులంక గ్రామానికి చెందిన దేశినీడి ఉదయ భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చినట్లు గురువారం ఆయన తెలిపారు. ఇందుకుగాను అలిండియా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు సుఖపాల్ సింగ్ ఖైరా, ఉపాధ్యక్షుడు అఖిలేష్ శుక్ల, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల, కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు గిడుగు రుద్రరాజు, పల్లం రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియోజకవర్గం స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: పాశర్లపూడి మెయిన్ రోడ్డులో 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్‌లో భాగంగా నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ కె.రాంబాబు గురువారం తెలిపారు. నగరం సబ్ స్టేషన్ పరిధిలోని పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, మామిడికుదురు, నగరం, మొగలికుదురు, తాటిపాక, పెదపట్నం, అప్పనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గ్రామంలోని పలు ప్రాంతాలతోపాటు రావులపాడులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు తెలిపారు.

ఆలమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పినపళ్ల, పెదపళ్ల, నర్శిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల తదితర గ్రామాలకు కరెంట్ ఉండదన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిచనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఉమా, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

కడలిలో 'పల్లెకుపోదాం'

రాజోలు: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడలిలో 'పల్లెకుపోదాం' కార్యక్రమాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పాల్గొని కడలిలోని తూర్పుపాలెం కాలనీలో పలు సమస్యలను గుర్తించారు. తమ కాలనీకి తాగునీరు సక్రమంగా రావడంలేదని, తాగునీటి నివారణకు ట్యాంకు నిర్మాణం చేయాలని స్థానికులు వేమాకు విజ్ఞప్తి చేశారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, వడ్లమూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అవసరాలు గుర్తిస్తున్నాం

మామిడికుదురు: పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా ప్రజల అవసరాలను గుర్తిస్తున్నామని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం అప్పనపల్లిలో జరిగింది. దీనిలో భాగంగా పార్టీ నేతలు ఇంటింటికి వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడే బైరిశెట్టి దుర్గారామకృష్ణ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పాల దిగుబడికి దెబ్బ

- పశువులపై ఎండ ప్రభావం
- వడదెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం లేనట్లే
- ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- పశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యుల సూచన



అంబాజీపేటలో ఆరుబయట ఉన్న పశువులు

అంబాజీపేట: వేసవిలో పాడి రైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడమే కాక ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడుకట్టే అవకాశం ఉండదని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కొక్కసారి పశువు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9,500, గేదెలు 12,300, కొత్తపేట నియోజకవర్గంలో ఆవులు 6180, గేదెలు 8,500, రాజోలు నియోజకవర్గంలో ఆవులు 5,150, గేదెలు 8,070 ఉన్నాయి.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంకి చేరి పారుడు వ్యాధి బారిన పడతాయి. రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సుల ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కొక్కసారి కింద పడి కొట్టుకుని స్పృహకోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి కోల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడ దెబ్బ తగిలిందని రైతు గ్రహించి, దగ్గరలోఉన్న పశువైద్యులను సంప్రదించాలి. వడ దెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి.

వడదెబ్బ తగలకుండా..



పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో పైకప్పును వేసి నట్లయితే కొబ్బరి, తాటాకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులకు, గేదెలకు పంకాలు ఏర్పాటు చేయాలి.

– జి.శ్రీనివాస్, పశువైద్యాధికారి, అంబాజీపేట

రేపు లయన్స్ క్లబ్ కైలాసభూమి ప్రారంభం

కొత్తపేట: స్థానిక సూర్యగుండాల పాయను చేర్చి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన లయన్స్ క్లబ్ కైలాసభూమిని శనివారం ఘనంగా ప్రారంభించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఆ ప్రాజెక్టు నిర్మాత నంభూరి వీరవెంకటసత్యసూర్య రెడ్డియ్య, లయన్స్ క్లబ్ సభ్యుడు, ప్రాజెక్టు నిర్మాణ పర్యవేక్షకుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. క్లబ్ సభ్యులు, పలువురు స్థానిక నాయకులతో కలిసి వారు గురువారం కైలాసభూమి వద్ద ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, లయన్స్ క్లబ్ గవర్నర్స్ ఈవీవీ ఈశ్వరకుమార్, డాక్టర్ బాదం బాలకృష్ణ తదితర ప్రముఖులు కైలాసభూమి, దానిలో వివిధ విభాగాలు ప్రారంభిస్తారన్నారు. సూర్యగుండాల రేవుగా, దహన సంస్కారాలకు ఎంతో పవిత్రమైన ప్రదేశంగా ఈ ప్రాంతం ప్రసిద్ధి కావడంతో అనాదిగా కొత్తపేట పరిసర గ్రామాల నుంచి మృతదేహాలను శ్మశానవాటికకే తీసుకువచ్చి అంత్య క్రియలు నిర్వహిస్తారన్నారు. అయితే ఇన్నాళ్లు తీవ్ర అసౌకర్యాల నడుమ ఆ క్రియలు నిర్వహించారని, ఇకపై ఆ పరిస్థితి లేకుండా రాజమహేంద్రవరం కైలాసభూమిలా ఈ లయన్స్ కైలాస భూమి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, పంచాయతీ మాజీ సభ్యుడు చోడపనీడి భాస్కరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు క్షమాకోళ్లపు రాధాకృష్ణ, కొత్త బంగారం, జిల్లా ఆర్యవైశ్య నాయకుడు తమ్మన సాయిప్రసాద్, టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట కైలాసభూమి ప్రారంభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రెడ్డియ్య, కంఠంశెట్టి తదతరులు

పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలి



పెదపళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, ఆశ, ఆరోగ్య అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పరిపూర్ణ ఆహారం తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పౌష్టికాహార వారోత్సవాలను విజయవంతం చేయాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ అధ్యక్షతన పౌష్టికాహార వారోత్సవాలపై అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 8న ప్రారంభమైన ఈ పక్షోత్సవాలు 22 వరకూ కొనసాగుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని సీడీపీఓ గజలక్ష్మి విజ్ఞప్తి చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెచ్‌వి పి.ఉమ, సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుందతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

అయినవిల్లి: వీరవల్లిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు లక్ష్మీ సౌజన్య, వైద్యులు విజయ్ 30 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు, ఆయన సోదరులు, కుటుంబ సభ్యులు గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగెడ ఫ్యామిలీ మెంబర్స్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



ముంగండలో మైక్రోఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ముంగండ గ్రామంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 2 ఎంఎల్‌డీ మైక్రోఫిల్టర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.రవీంద్ర బాబు, ఏఈ జె.కళ్యాణ్ చక్రవర్తి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అంతకు ముందు నియోజకవర్గంలోని 26 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.17,32,310 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. నరేంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రూ.1.15 లక్షలతో 5 ఎంవీఏ అదనపు ట్రాన్స్ ఫార్మర్, రెండు ఫీడర్ బ్రాకెర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఈ జీవీ ఆచార్యులు పాల్గొన్నారు.

'సానబోయిన'కు పితృవియోగం

అయినవిల్లి: మడుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కాంటాక్టర్ సానబోయిన నాగేశ్వరరావు తండ్రి నారాయణమూర్తి వయో భారంతో గురువారం మృతి చెందారు. నారాయణమూర్తి భౌతిక కాయాన్ని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాగేశ్వరరావు ఓదార్చారు. శ్రీనివాసరావు వెంట మడుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బొక్కా రమేష్, పంపని పెద్ద, మట్టపర్తి రామారావు, కారుపల్లి సత్తులు, కాశీ సత్యనారాయణ, కమిడి వెంకటేశ్వరరావు,నామడి శ్రీనివాస్,పినిపే బుజ్జి, చోడే ప్రసాద్ , మోతా నాగ పండు తదితరులు ఉన్నారు.



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

విద్యార్థులకు పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ

మామిడికుదురు: కోనసీమ జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో పాలిటెక్నిక్ కోచింగ్ ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో సుమారు 60 మంది విద్యార్థులకు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మామిడికుదురు మండల పరిధిలోని మొగలికుదురు జెడ్పీ హెచ్ స్కూల్లో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నయినాల రఘురామయ్య తెలిపారు. వే

సొసైటీ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సొసైటీ సభ్యులు

రాజోలు: పొన్నమండ ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యుడు ఉండ్రు ముసలయ్య కుటుంబానికి సొసైటీ ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఇటీవల ముసలయ్య మృతి చెందారు. ఆపదలో ఉన్న ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు ఆర్థికంగా తోడ్పాటును అందించేలా గతంలో తీర్మానం చేశామని సొసైటీ అధ్యక్షుడు కుసుమ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యదర్శి నల్లి సూర్యం, ఉండ్రు రాజబాబు, కుసుమ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలను ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజన సదుపాయాలు బాగా లేవని, చిక్కీ ఇవ్వడం లేదని విద్యార్థులు తనకు లిఖిత పూరకంగా ఫిర్యాదు చేసినట్టు కిరణ్ తెలిపారు. అనంతరం ముంగండ గ్రామంలోని రేషన్ షాపును ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, సివిల్ సప్లయి శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



ఉయ్యూరువారి మెరకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక ప్రగతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు గురువారం పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. పార్టీ నాయకులు కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, స్థానికులు నక్కా రామారావు, గెడ్డం చంద్రరావు, రాపాక శివ, దిడ్ల ప్రసన్న, నక్కా శ్రీను, పసుపులేటి సుబ్రహ్మణ్యం, చొప్పల కన్నయ్య, జిల్లెళ్ళ కవిత, రాపాక శాంతి, రాపాక ఝాన్సీ పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంతో కొబ్బరి తోటలకు మేలు

మామిడికుదురు: వేసవిలో కొబ్బరి తోటలకు మల్చింగ్ విధానంతో ఎంతో మేలు జరుగుతుందని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చలపతిరావు సూచించారు. పాశర్లపూడిలంకలో ఆదర్శ రైతు పెదమల్లు నాగబాబు వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన ఉద్యాన శాస్త్రవేత్త కిరీటితో కలిసి గురువారం సందర్శించారు. సోలార్ ఇరిగేషన్ సిస్టం, అక్కడ ఏర్పాటు చేసిన అరపలు, తదితర విభాగాలను పరిశీలించారు. స్థానిక రైతులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. వేసవిలో కొబ్బరి తోటల్లో పదును ఆరిపోకుండా కొబ్బరాకులతో తోటలను కప్పి ఉంచాలన్నారు. కొబ్బరి తోటలకు సరిపడేలా నీటి తడులు పెట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన దేశవాళీ, హైబ్రీడ్ కొబ్బరి మొక్కలు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. దేశవాళీ రకం మొక్క రూ.100 వంతున ఒక్కొక్క రైతుకు వంద మొక్కలు విక్రయిస్తామన్నారు. హైబ్రీడ్ రకం మొక్క ఖరీదు రూ.350 అని ఒక్కొక్క రైతుకు 30 మొక్కలు అమ్ముతామన్నారు. మొక్కలు అవసరమైన రైతులు వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకుని దాన్ని పూర్తి చేసి అంబాజీపేట కార్యాలయంలో అందించి మొక్కలు తీసుకు వెళ్లాలన్నారు. తెల్లదోమ ప్రభావం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. సెప్టెంబరులో రైతుల కొబ్బరి పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తెల్లదోమ నివారణకు ఉచితంగా శిలీంద్రాలను అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పాశర్లపూడిలంకలో నాగబాబు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మెనూ ప్రకారం భోజనం



పుల్లేటికుర్రు హెచ్‌ఎంను సత్కరిస్తున్న కిరణ్, డీఈఓ

అంబాజీపేట: మధ్యహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యహ్న భోజన పథకాన్ని కిరణ్‌తోపాటు డీఈఓ సలీంభాషా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాభోజన పథకం వండే వంటలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట చేసే ప్రాంతాన్ని, స్టాకు రిజిష్టర్, చిక్కీలు, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సహ పంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్న హెచ్‌ఎం కె.సూర్యకనకదుర్గ, మిడ్డేమీల్స్ నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలో కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, డీఎస్ఓ అడపా ఉదయ్ భాస్కర్, పౌరసరఫరాల మేనేజర్ బాల సరస్వతి, తూనికల కొలతల ఆఫీసర్ రాజేష్, అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, మిడ్డేమీల్స్ నిర్వహణ ఇన్‌చార్జి జి.వి.రమణ, స్టాఫ్ సెక్రటరీ టి.శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని రైతులందరూ అవలంబించడం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు పండించాలని బిళ్లకుర్రు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. బిళ్లకుర్రు సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పీఎండీఎస్ కిట్స్ నవధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఐదు కేజీల నవధాన్యాల కిట్లను రూ.450గా రేటు నిర్ణయించి బిళ్ళకుర్రు సచివాలయంలో సిద్ధంగా ఉంచామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎంవీవీఎస్ శ్రీనివాసరావు, పీఆర్‌పీ లంకే ప్రసాద్, రైతులు, డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



బిల్లకుర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరావు

మహిళలు జీవనోపాధి మెరుగు పరుచుకోవాలి

మలికిపురం: గ్రామీణ ప్రాంతాలలో మహిళలు జీవనోపాధి మెరుగుపరచుకోవాలని మండల వెలుగు ఏపీఎం డి.అజయ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్థిక జీవనోపాధిపై మొబైల్ యాప్ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలు తాము తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక సమృద్ధి సాధించాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు దూది దుర్గా భవానీ, కార్యదర్శి డి.అశ్వని, కోశాధికారి కె.దివ్య, జేసీ గాడా కరుణ, మాజీ సర్పంచ్ బందెల పద్మ, సీసీ నాగరాజు, వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ పద్మ

మొండెపులంకలో డెంగీ కేసు



గిడుగువారిపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పి.గన్నవరం: మొండెపులంక గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలికి డెంగీ పాజిటివ్ నమోదయ్యిందని నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వైవీ ప్రియాంక తెలిపారు. ఈనెల ఒకటో తేదీన వృద్ధురాలు అనారోగ్య కారణంగా కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఈనెల 8న ఆమెకు రక్త పరీక్షలు చేయగా, డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించారు. దీంతో అదే ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారని ప్రియాంక వివరించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ నుంచి వచ్చిన సమాచారంతో నాగుల్లంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మొండెపులంక గిడుగువారిపాలెం ప్రాంతంలో వైద్యాధికారులు టీమ్‌లు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్ల మధ్య ఏబేటు మందు స్ప్రే చేయించారు. పంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆప్రాంతంలో పర్యటించి దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మహమ్మద్ రియాజ్ తుస్నీషా బేగం, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ ఎం.నాగరాజు, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, మరియమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిబాట, బంగారు బాట

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ-1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలనుఅందించారు. ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం కె.వి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ జ్యోతి, టీచర్ బషీర్ బేగం, హైస్కూల్ హెచ్‌ఎం జాన కనక లింగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ కనకదుర్గ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అడ్మిషన్ పత్రం ఇస్తున్న విద్యాశాఖాధికారులు

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఆ శాఖ సీఐ కే కాత్యాయని తెలిపారు. విస్తృత దాడుల్లో భాగంగా ఆత్రేయపురం మండలం రాజవరం సమీప గోదావరిలో ప్లాస్టిక్ పీపాలతో ఉంచిన బెల్లపు ఊటను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. అలాగే వెలిచేరు గ్రామానికి చెందిన వీరమళ్ల వెంకటసత్యనారాయణ అనే వ్యక్తిని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో అమలాపురం ఏఈఎస్ జీ అమర్‌బాబు, ఎస్సై కే అన్నవరం ఎక్సైజ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.